గ్రామీణ రోడ్లకు బీటీ మార్గం

- ఎట్టకేలకు కనెక్టివిటీ..
- నిధులు కేటాయించిన ఐటీడీఏ
- రూ.2370.80 లక్షలు మంజూరు
- మారనున్న మారుమూల పల్లెల రూపురేఖలు
- తొలగనున్న ప్రజల రవాణా కష్టాలు


కత్తెర్ల నుంచి బర్లగూడెం వెళ్లే మట్టిరోడ్డు

బెల్లంపల్లి: ఏళ్ల తరబడి నుంచి తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్న గ్రామీణ ప్రాంతాల రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బీటీ రోడ్లతో పల్లె ప్రాంతాల రోడ్లను అనుసంధానం చేయనున్నారు. ఇందుకు సంబంధించి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నెన్నెల, తాండూర్, కాసిపేట, బెల్లంపల్లి, కన్నెపల్లి మండలాల పరిధిలోని ఎనిమిది రోడ్లకు గాను సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) రూ.2370.80లక్షల నిధులు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఏమాత్రం పట్టింపు చేయకుండా ఉన్న ఆయా మట్టి రోడ్లు బీటీ రోడ్లుగా రూపాంతరం చెంది మండల కేంద్రాలకు వెళ్లే బీటీ రోడ్లతో కనెక్టివిటీ చేయనుండటంతో రవాణా సౌకర్యం మెరుగుపడనుందనే ఆశాభావాన్ని పల్లె ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

పల్లె ప్రాంతాల రోడ్లు ఏళ్లు గడుస్తున్నా ఏమాత్రం మెరుగుపడని పరిస్థితులు ఉంటున్నాయి. రోడ్లు సరిగ్గా లేక గ్రామీణులు ఏటా తీవ్ర రవాణా ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్లు కావడంతో బురద ఏర్పడి రాకపోకలు సాగించడానికి గ్రామీణులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ కారణంగా అత్యవసరంగా 108అంబులెన్స్ కూడా రాలేని ప్రతికూల పరిస్థితులు ఉండగా, ఆ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి బీటీ రోడ్లను నిర్మించి మండల కేంద్రాలకు వెళ్లడానికి బీటీ రోడ్లతో అనుసంధానం చేయనున్నారు. ఇందుకోసం ఐటీడీఏ సానుకూలంగా స్పందించడం అభినందనీయం. దీంతో మట్టిరోడ్లు పోయి బీటీ రోడ్లు నిర్మాణం కానుండగా, ఇప్పటివరకు పడిన గ్రామీణుల రవాణా కష్టాలు ఇకపై దూరం కానున్నాయి. కాగా ప్రతిపాదిత రోడ్లకు ఎస్టిమేషన్ వేసి మరో పక్షం రోజుల్లో టెండర్లను పిలవనున్నారు. టెండర్ల ప్రక్రియకు కనీసం రెండు నెలల వ్యవధి పట్టే అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ పట్టనుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మంజూరైన బీటీ రోడ్లు

మండలం	నిర్మించనున్న రోడ్డు	కేటాయించిన నిధులు(రూ.లక్షల్లో)
నెన్నెల	గంగారం టు పొట్యాల వయా కొంపల్లి బీటీ రోడ్డు	315.00
తాండూర్	కత్తెర్ల టు బర్లగూడెం బీటీరోడ్డు	200.00
కాసిపేట	పల్లంగూడ టీడబ్ల్యు రోడ్డు టు కోనూర్ రాముగూడూర్ బీటీరోడ్డు	138.00
కాసిపేట	ధర్మారావు పేట్ పీఆర్ రోడ్డు టు నాయకపు గూడెం బీటీ రోడ్డు	92.80
బెల్లంపల్లి	చాకేపల్లి పీఆర్ రోడ్ టు అచ్చులాపూర్ టీ డబ్ల్యూ బీటీరోడ్డు	345.00
బెల్లంపల్లి	చాకేపల్లి టు కత్తెర్ల బీటీ రోడ్డు	380.00
బెల్లంపల్లి	రంగపేట టు ఎల్లారం బీటీ రోడ్డు	430.00
కన్నెపల్లి	కొమ్ముగూడెం టు టేకులపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు	470.00

దూరభారం తగ్గనుంది



మాది పొట్యాల గ్రామం. మా గ్రామం నుంచి గంగారం గ్రామానికి రేషన్ సరుకులు తీసుకురావడానికి ఎన్నో ఏళ్ల నుంచి ముప్పు తిప్పలు పడుతున్నాం. ఇన్నాళ్లకు మా రెండు గ్రామాల మధ్య వాగుపై కొత్తగా బ్రిడ్జి నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది. బ్రిడ్జి నిర్మాణంతో కిలో మీటరు వ్యవధిలోనే ఆవుడం, గంగారం గ్రామాలకు చేరుకుంటాం. మా పిల్లలు బడికి వెళ్లడానికి కూడా సౌకర్యం కలగనుంది.

– నైతం మల్లయ్య, పొట్యాల

వాగులు దాటి పొలాలకెళ్తున్నాం



గంగారం పెద్ద చెరువు కింద చాలా దూరంలో మా పొలాలు ఉన్నాయి. పొలం పనులకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక వాగులు, వంకలు దాటి వెళ్తున్నాం. బురదలో నుంచి మందు బస్తాలు తీసుకెళ్లడానికి నానా తంటాలు పడుతున్నాం. ఇంతకాలానికి ఎమ్మెల్యే కృషి వల్ల బ్రిడ్జి, రోడ్డు మంజూరు కావడంతో మా కష్టాలు తడతేరనున్నాయి. రోడ్డు, బ్రిడ్జి పనులు తొందరగా పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలి.

– జాడి లక్ష్మి, పొట్యాల

నిండుకుండలా గొల్లవాగు ప్రాజెక్ట్



- మత్తడి దూకుతున్న నీళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకున్న ప్రాజెక్ట్

భీమారం: ఇటీవల కురిసిన వర్షాలకు గొల్లవాగు ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. మత్తడి పై నుంచి నీళ్లు పారుతున్నాయి. దీంతో భీమారం, చెన్నూర్ మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 155.500మీటర్లు కాగా, పూర్తి స్థాయిలో నీళ్లు వచ్చాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా భీమారం, చెన్నూర్ మండలాల్లోని 9500ఎకరాలకు సాగు నీరందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఖరీఫ్ పంటలకు నీటివిడుదల

గొల్లవాగు ప్రాజెక్ట్ నీటిని కాలువల ద్వారా సోమవారం విడుదల చేశాం. రెండు మండలాల్లోని నిర్దేశించిన 9500ఎకరాలకు సాగు నీటిని అందిస్తాం. ఈ విషయంలో రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

– ప్రవీణ్‌కుమార్, గొల్లవాగుప్రాజెక్ట్ డీఈఈ

ఉప్పొంగిన వాగు.. నిలిచిన రాకపోకలు


ఉధృతంగా ప్రవహిస్తున్న టేకుమట్ల వాగు


ఆవుడంలో కొట్టుకుపోయిన పంట పొలాలు

జైపూర్: మండల వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు టేకుమట్ల పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రసూల్‌పల్లి, మిట్టపల్లి, కాన్కూర్, ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, శివ్వారం గ్రామాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు వరకు కుండపోత వర్షం కురిసింది. ఎగువప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో టేకుమట్ల లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ఉప్పొంగింది. దీంతో టేకుమట్ల–షెట్‌పల్లి–శివ్వారం గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేస్తూ అధికారులు రోడ్డుకు అడ్డంగా చెట్లు వేశారు. పగలు తేలికపాటి వర్షం కురిసినప్పటికీ రాత్రులు కుండపోతవర్షం కురుస్తోంది.

చెరువులకు గండి.. వృథాగా నీరు

నెన్నెల: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆవుడంలోని గుళ్ల చెరువు, నలి చెరువులకు గండిపడి నీరంతా పంట పొలాల్లోకి చేరింది. దీంతో చెరువుల దిగువ భాగంలో నాట్లు వేస్తున్న వరి పొలాలు పూర్తి స్థాయిలో కొట్టుకుపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చెరువులోని నీరంతా వృథాగా పోతుండటంతో వరి పొట్ట దశలో ఉన్నప్పుడు చెరువులో నీరు లేక చివరి తడులకు ఇబ్బందులు తప్పవని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పంట పొలాలను సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి వివేక్

వర్షానికి కూలిన ఇల్లు

మందమర్రిరూరల్: పట్టణంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు కాలనీలు నీటమునిగాయి. పాత బస్టాండ్ ఏరియాలోని విద్యానగర్, ఎస్సీఎస్టీ కాలనీ, చెంచుకాలనీ తదితర ప్రాంతాలు ఇళ్లలోకి నీరు చేరడంతో రాత్రంతా జాగరమైంది. సింగరేణి ప్రాంతంలోని పలు ఏరియాలోని క్వార్టర్లలోకి వర్షపునీరు చేరింది. నిత్యావసర సరుకులు తడిసాయి. అంగడిబజార్‌లోని శివకేశవాలయం (దుబ్బగూడెం) వద్ద నడిమెట్ల పోచం అనే వ్యక్తి ఇల్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. వర్షాలతో ఇబ్బంది పడుతున్న విద్యానగర్, చెంచుకాలనీల్లో రాష్ట్ర మైనింగ్, కార్మిక ఉపాధి శాఖ మంత్రి శనివారం పర్యటించి అధికారులతో మాట్లాడి ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్లుప్తంగా

విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదవాలి


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

బెల్లంపల్లి: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ జిల్లా ఉపసంచాలకుడు సీ.హెచ్ దుర్గా ప్రసాద్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. బాలికలు శ్రద్ధగా చదువుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. వసతి గృహం హెచ్‌డబ్ల్యూవో విజయలక్ష్మి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

మోదెలలో 'పొలంబాట'


పొలంబాటలో విద్యుత్‌శాఖ అధికారులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని మోదెల గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరించారు. పొలాల్లో వంగిన స్తంభాలు, లూస్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ సరిగ్గా లేకపోతే అన్నింటినీ సరిచేశారు. రైతులు పొలాలలోని మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని, దాని ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ గణేశ్, సిబ్బంది నర్సింగరావు, సత్యనారాయణ, రవికుమార్, భూమన్న, రైతులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

తాండూర్: తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. తాండూర్ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో సిబ్బందితో ఆకస్మికంగా దాడి చేయగా ఆరుగురు పేకాడుతూ పట్టుబడ్డారని, వారి నుంచి రూ.1100నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవీ అధికారుల దాడులు నియంత్రించాలి

పాతమంచిర్యాల: ఆదివాసీలపై అటవీ అధికారుల దాడులను నియంత్రించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్మన్నపేట అటవీ ప్రాంతంలో ఆదివాసీలు ఏళ్ల నుంచి పోడు భూములు సాగుచేసుకుంటున్నారని, రిజర్వ్ ఫారెస్టు పేరుతో ఆదివాసీలను అక్కడి నుంచి అటవీ అధికారులు వెళ్లగొట్టాలని చూస్తున్నారన్నారు. ఆదివాసీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 16మంది మహిళలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, దినేష్, రవి, బషీర్, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు


వేమనపల్లిలో జెండా ఆవిష్కరణ

బెల్లంపల్లి/బెల్లంపల్లిరూరల్/వేమనపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు శనివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ, బెల్లంపల్లి మండలం, వేమనపల్లి మండలాల్లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎర్ర జెండాను ఎగురవేశారు. అమర వీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమాల్లో వేమనపల్లిలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల దాసు, నేషనల్ హెల్త్ స్కీం జిల్లా కార్యదర్శి బాపు, సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యుడు శనిగారపు రాజేందర్, సీపీఐ బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్పనర్సయ్య, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే.. రాజ మార్గము


చెన్నూర్: లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి, లాయర్లు

లక్సెట్టిపేట: రాజీ మార్గమే రాజ మార్గమని జూనియర్ సివిల్ జడ్జి కాసమల సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బులు వృథా చేసుకోవద్దని రాజీ మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. రాజీ పడితే ఇద్దరు గెలుస్తారన్నారు. అనంతరం 5 సివిల్, 510 క్రిమినల్, 238 సెకండ్ క్లాస్ కేసులు మొత్తం 753కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ఏజీపీ సత్యం, లోక్ అదాలత్ సభ్యులు భూమరెడ్డి న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూర్‌లో నేషనల్ లోక్ అదాలత్

చెన్నూర్: చెన్నూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జడ్జి పర్వతపు రవి ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం కేసులు 1050కాగా, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు 938కాగా రూ.5,23,650జరిమానా కింద వసూలయ్యాయి. బ్యాంకు కేసులు 42కాగా రూ.20,88,783 వసూలుతో పరిష్కారం అయ్యాయి. 39 క్రిమినల్ కేసులు, రెండు సివిల్ కేసులు రాజీ పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్స్, పోలీస్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు

జైపూర్: ప్రభుత్వం ఎస్సీ బాలుర వసతి గృహంలో అన్నిరకాల వసతులు కల్పిస్తుందని, విద్యార్థులు అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సీ బాలుర వసతి గృహ వార్డెన్, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. జైపూర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందించే భోజన మెనూ, ఉచిత వసతి, వసతి గృహ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలు, విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకుంటున్న జాగ్రత్తలను తల్లిదండ్రులతో చర్చించారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో పోషకుల (పేరేంట్) సమావేశం శనివారం నిర్వహించారు. హాస్టల్‌లో ఉండే పిల్లలతో కలిసి భోజనం చేసి తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో స్పెషల్‌క్లాస్‌లపై ఆరా తీశారు. వసతిగృహ సంక్షేమాధికారి కుమారస్వామి, జన్నారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు అంకుష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఉద్యోగులు అన్ని రంగాల్లో రాణించాలి


బహుమతులతో జీఎం, ఉద్యోగులు, అధికారులు

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు క్రీడలు, రెస్క్యూ వంటి తదితర అన్ని రంగాల్లో రాణించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 10, 11న రామగుండం–2 ఏరియాలో జరిగిన 54వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీల్లో రాణించి బహుమతులు సాధించిన ఉద్యోగులను జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్ శనివారం అభినందించారు. నవంబర్‌లో నాగాపూర్‌లోని వెస్టన్ కోల్ లిమిటెడ్‌లో నిర్వహించే ఆలిండియా మైన్స్ రెస్క్యూ కాంపిటేషన్‌కు ఎంపికైన జి.శంకర్, (ఓవర్మెన్, ఐకే 1ఏ), ఆర్ సురేష్, (జనరల్ అసిస్టెంట్ ఐకే 1ఏ) ఉద్యోగులను జీఎం ప్రత్యేకంగా అభినందించారు.

యాజమాన్యం మొండివైఖరి వీడాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: సింగరేణి యాజమాన్యం కార్మిక సమస్యల పరిష్కారం విషయంలో మొండిగా వ్యవహరిస్తుందని మొండి వైఖరి విడనాడకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు తప్పవని గుర్తింపు కార్మికసంఘం(ఏఐటీయూసీ) మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఏరియాలోని కేకే–5 గనిపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం అవలంబించే వైఖరి వల్లనే శుక్రవారం జరిగే స్ట్రక్చర్ మీటింగ్‌ను బహిష్కరించామన్నారు. కార్మికుడి సొంతింటి పథకం, పెర్క్స్‌పై ఇన్‌కం టాక్స్ రద్దు, మారుపేర్ల మార్పు, గత ఆర్థిక సంవత్సరం సంస్థకు వచ్చిన లాభాల వాటాల్లో 35శాతం పంపిణీ తదితర సమస్యలపై యాజమాన్యనికి అడిగితే కమిటీల పేరిట కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఆయన వెంట ఆ సంఘం నాయకులు సుదర్శన్, కంది శ్రీనివాస్, సంపత్, రాజేశం తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ముస్కే సమ్మయ్య

'యాజమాన్యం నిరంకుశ వైఖరి వీడాలి'

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిరంకుశ వైఖరి అవలంభిస్తుందని, దీన్ని విడనాడాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న కంపెనీ సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశం, 13న జేసీసీ సమావేశాలు బహిష్కరించామని తెలిపారు. గత సమావేశంలో గుర్తింపు సంఘంతో కుదుర్చుకున్న ఒప్పందాలను ఇప్పటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు నిరసనగా బహిష్కరించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, నాయకులు సురేష్, గొర్రె నరసయ్య, సుధాకర్, లచ్చన్న, గండి సతీష్, అఫ్రోజ్ ఖాన్, పెద్దన్న, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని కాలనీల్లో ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మందమర్రిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడునని వినియోగదారులు సహకరించాలని యాజమాన్యం తెలిపింది.

18న జన్నారంలో వాలీబాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–17 బాలుర విభాగం వాలీబాల్ ఎంపిక పోటీలు ఈ నెల 18న జన్నారం స్లేట్ స్కూల్లో నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ యాకుబ్, టోర్నమెంట్ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డిని సంప్రదించాలన్నారు.

డిగ్రీ అడ్మిషన్‌లకు దరఖాస్తులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందడానికి దోస్త్ స్పెషల్ ఫేస్ ద్వారా విద్యార్థులు ఈ నెల 15, 16వ తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ మహాత్మా సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు దరఖాస్తు చేసుకున్నా సీటు రాని విద్యార్థులకు చివరి అవకాశం ఉందని దరఖాస్తు చేసుకొని 17వ తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు.

విధుల్లో సెల్ఫీల సరదా!


విధుల్లో సెల్ఫీలు దిగుతున్న అటవీ సిబ్బంది

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్‌లో శుక్రవారం అటవీ సిబ్బందిపై దాడి జరగడంతో ఆ ప్రాంతాన్ని ఉమ్మడి జిల్లాలోని అటవీ సిబ్బంది శనివారం మోహరించారు. ఈ క్రమంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది సిబ్బంది సెల్ఫీలతో సరదా చేశారు. ఈ దృశ్యాన్ని అక్కడున్న పలువురు తమ ఫోన్లలో చిత్రీకరించారు. వీళ్లంతా విధులు నిర్వహించేదుకు వచ్చారా? లేక సెల్ఫీలు దిగేందుకు ఇక్కడకు వచ్చారా? అని చర్చించుకున్నారు.

ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలందించాలి

- మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ

రామకృష్ణాపూర్: సింగరేణి కార్మికులకు వారి కుటుంబసభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ సూచించారు. పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిని శనివారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్‌వోటుజీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆసుపత్రి డీవైసీఎంవో డాక్టర్ మధు, సివిల్ ఎస్ఈ రాము, వెల్ఫేర్ ఆఫీసర్ మదర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏరియా జీఎం

మందమర్రిరూరల్: రాష్ట్ర మైనింగ్, కార్మిక ఉపాధికల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ శనివారం మంచిర్యాలలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. మందమర్రి ఏరియా సింగరేణి పరిస్థితిని వివరించినట్లు జీఎం తెలిపారు.

'వేలం అడ్డుకొని నష్టం చేశారు'

శ్రీరాంపూర్: ఇన్నాళ్లు కొన్ని కార్మిక సంఘాలు బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకొని సింగరేణికి తీవ్ర నష్టం చేశాయని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, సింగరేణి విభాగం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ కారణాలతో సంస్థను బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దని అడ్డుకున్నారని తెలిపారు. ఎట్టకేలకూ నేడు వేలానికి అనుకూలంగా వ్యవహరించడం, ప్రభుత్వం కూడా వేలంలో పాల్గొనడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సింగరేణి అభివృద్ధికి ఇది ముందడుగు అన్నారు.

పనులు ప్రారంభం

జన్నారం: ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సహకారంతో మండలంలో అభివృద్ధి జరుగుతుందని, గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ అన్నారు. పొనకల్ గాంధీనగర్‌లో శనివారం పాఠశాలకు ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు.